ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను వర్షం వదలడం లేదు. బుధవారం వికారాబాద్ మండలం చిట్టంపల్లిలో అత్యధికంగా 84.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండు మూడు రోజులుగా జోరు వాన కురుస్తోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తుండటంతో జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. రోడ్లన్నీ చిత్తడిగా మారి ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని నాగర్‌గూడ వద్ద ఈసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మొయినాబాద్ మండలం అమలాపురం, వెంకటాపురం చెరువులు మత్తడి దుంకుతున్నాయి. అమలాపురంలోని గులాబీ తోట వరద నీటికి పూర్తిగా పాడైంది.





మత్తడి దుంకుతున్న మొయినాబాద్ మండలం వెంకటాపురం చెరువు

వదలని వర్షం

ఉమ్మడి జిల్లాలో జోరువాన



మొయినాబాద్ : అమలాపురం చెరువు..



షాబాద్ : నాగర్‌గూడ వద్ద నిండుకుండలా ప్రవహిస్తున్న ఈసీ వాగు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- దెబ్బతిన్న పంటలు, చిత్తడిగా రోడ్లు
- వికారాబాద్ మండలం చిట్టంపల్లిలో 84.3 మి.మీ వర్షపాతం

ఉప్పొంగిన వాగులు వంకలు

రంగారెడ్డి అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. జలాశయాలు, చెరువులు, వాగుల్లోకి భారీగా నీరు చేరుతోంది. కొన్ని ప్రాంతాల్లో అలుగు పారాయి. గ్రామాల్లో మట్టి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ఆర్ అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దంచికొట్టిన వానకు వికారాబాద్ జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. దోమ మండలం ఊటుపల్లిలో మొక్కజొన్న పంట పాడైంది. వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టంపల్లిలో

మిగతా 8వ పేజీలో...

ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

షాబాద్ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాగర్‌గూడ వద్ద ఈసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. బ్రిడ్జి వద్ద వాగు ప్రవాహాన్ని చూడటానికి వాహనదారులు, స్థానికులు ఆసక్తి చూపారు.



కొందుర్గు: బేకులపల్లి వాగులో పడిన బైక్‌ను బయటికి తీస్తున్న యువకులు



మహేశ్వరం: జ్యోతిరావు పూలే బీసీ వసతి గృహంలో ఆహారాన్ని రుచి చూస్తున్న కలెక్టర్

సంక్షేమ హాస్టళ్లలో సకల సౌకర్యాలు

- కలెక్టర్ నారాయణరెడ్డి

మహేశ్వరం/రంగారెడ్డిఅర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి) : సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం సాయంత్రం మహేశ్వరంలోని జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్, ఎస్సీ బాలికల వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో బియ్యం, కూరగాయలు, ఇతర సరుకులు నిల్వ ఉంచిన గదిని, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అలాగే విద్యార్థుల కోసం వండిన కూరలను రుచి చూశారు. మజ్జిగ నాణ్యతగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. స్టోరేజ్, విద్యార్థుల గదులు, మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా మహేశ్వరం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో సోలార్, కిటికీలకు లాక్ లేదని, డైనింగ్, స్టడీ హాల్ కావాలని విద్యార్థినిలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి లావణ్య, మహేశ్వరం తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజ, తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి, బీసీ వసతి గృహ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వర్షాలు కురుస్తున్నాయి.. మొక్కలు నాటండి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహోత్సవం ఏర్పాట్లు, ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ హాస్టళ్లలో వసతులు, రేషన్ కార్డుల జారీపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వన మహోత్సవంలో ప్రజాప్రతినిధులు, స్థానికులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను వారంలో పూర్తిచేయాలని తెలిపారు. నాటిన మొక్కలకు జియో ట్యాగింగ్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన ఇళ్లకు సోమవారం నాటికి నగదు జమ చేయాలన్నారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 10 వరకు రేషన్ కార్డుల జారీ ఉన్నందున, వీలైనంత త్వరగా జిల్లాలో దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా మున్సిపాలిటీల్లో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. జూమ్, టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రమాదకర చెరువులు, మ్యాన్‌హోల్స్, డ్రైనేజీలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సం క్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సమస్యలు తలెత్తనీయొద్దన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, మందుల కొరత లేకుండా చూడాలన్నారు. డీఆర్వో సంగీత, డీఆర్‌డీవో పీడీ శ్రీలత, హౌసింగ్ పీడీ హనుమంతు నాయక్, డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు, సీపీవో సౌమ్య, బీసీ సంక్షేమాధికారి కేశురాం, ఉద్యానవన శాఖ అధికారి సురేష్ పాల్గొన్నారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శార్వాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులలో పీజీతో పాటు నెట్, పీహెచ్‌డీ అర్హతలతో పాటు అనుభవం ఉండాలని తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలలోపు డిగ్రీ కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

చౌదరిగూడ,జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఎస్‌వో రాగసుధ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 20 సీట్లు, బైపీసీలో 5 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదవ తరగతి మెమో, టీసీ, కుల ధ్రువీకరణ పత్రాలు, బోనఫైడ్, పాస్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో బాలికలు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీకి అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ప్రభుత్వం అండగా నిలిచి, అభివృద్ధి వైపు నడిపిస్తుందని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష ఆధ్వర్యంలో బుధవారం డిపో ఆవరణలో జరిగిన ఆర్టీసీ సంబరాల కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ఆర్టీసీకి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచి అభివృద్ధి వైపు నడిపిస్తుందన్నారు. ఆర్టీసీ అభివృద్ధి, మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం మహాలక్ష్మీ పథకాన్ని తీసుకువచ్చిందని గుర్తుచేశారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు ప్రయాణించగా, ప్రభుత్వం ఆర్టీసీకి 6,680 కోట్ల రూపాయలను చెల్లిస్తుందన్నారు. షాద్‌నగర్ డిపోలో సైతం కోటి 62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా రూ.71 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం షాద్‌నగర్ డిపోకు 53 కొత్త బస్సులను ఇప్పించామని గుర్తు చేశారు. షాద్‌నగర్ డిపోలో డ్రైవర్ల కొరత ఉందని, బస్టాండ్ నుంచి బయటకు వెళ్లే దారి సమస్యను తీర్చాలని డిపో మేనేజర్ ఉష కోరారు. ఈ సందర్భంగా ఆర్టీసీ నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఎమ్మెల్యే జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, మెకానికల్ ఇంజనీర్ నాగులు, అర్జున్ కుమార్, వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జి. బాల్‌రాజ్‌గౌడ్, పి.వెంకట్‌రాం రెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, అరుంధతి పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో!

- నిలువ నీడలేక తప్పని ఇబ్బందులు
- రోడ్లపైనే ప్రయాణికుల పడిగాపులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

నిలిచిపోయిన నిర్మాణ పనులు

నందిగామ, జులై 23(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వంతో బస్టాండ్ నిర్మాణ పనులు ముందుకు సాగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ మండల కేంద్రంలో ప్రయాణికులకు 'నిలువ నీడ లేక' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. అప్పటికప్పుడు నందిగామ మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో పాత జాతీయ రహదారి పక్కన పభుత్వ స్థలాన్ని పరిశీలించారు. త్వరగా పనులు ప్రారంభించాలని స్థానిక నాయకులకు సూచించడంతో వారు హడావుడిగా పనులు చేపట్టారు. తర్వాత అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయి.

ఎండుతూ.. తడుస్తూ..

పేరుకే బస్టాండ్.. అక్కడ కూర్చోడానికి వీలులేదు, నిలబడడానికి అవకాశం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు వెక్కిరిస్తున్నాయి. పాలకుల వైఖరిని ప్రశ్నిస్తున్నాయి? ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ప్రజలకు ఆమడదూరంలో ఉండడంతో

మిగతా 8వ పేజీలో...



నందిగామలో నత్తనడకన బస్టాండు నిర్మాణ పనులు



ఇబ్బందులు పడుతున్నాం..

బస్టాండ్ లేకపోవడంతో బస్సుల కోసం ముఖ్య కూడలిలోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణాల ఎదుట బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల ఎదురు చూస్తున్నాం. రాత్రి సమయంలో మరీ ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అన్ని సౌకర్యాలతో బస్టాండ్‌ను త్వరగా నిర్మించాలి.

- బన్నివర్ధన్ రెడ్డి, విద్యార్థి, నందిగామ



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్

స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయండి

షాద్‌నగర్ అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.8వేల కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్‌చౌహాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని కోరారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సుమేర్, శివశంకర్, సాయి, నరేష్, రాజు, కార్తీక్, ప్రకాష్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మత్స్యశాఖ ఏడీ పూర్ణిమ

కేశంపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్యశాఖ ఏడీ పూర్ణిమ సూచించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధి కొత్తపేట గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ సంఘాల అభివృద్ధికి మత్స్యశాఖ కృషి చేస్తుందన్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. సంఘంలోని ఒక్కో సభ్యునికి రూ.50వేల బ్యాంకు రుణం ఇప్పిస్తామని వివరించారు. అనంతరం తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ చేతన్‌తో ఏడీ మాట్లాడారు. మత్స్యకార సంఘాల సభ్యులకు రుణాలు ఇవ్వాలని కోరారు. తాము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు బ్యాంకు మేనేజర్ ఏడీకి వివరించారు. కార్యక్రమంలో మత్స్యకారులు సంఘం అధ్యక్షుడు కాడమోని జంగయ్య, సభ్యులు అల్లే ప్రవీణ్, సుధాకర్, శ్రీనివాసులు, గుంటి జంగయ్య, లక్ష్మీ, పద్మమ్మ, నరేష్, కుమార్, గణేష్, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యశాఖ జిల్లా ఏడీ పూర్ణిమ



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందిస్తున్న యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

అర్హులందరికీ రేషన్ కార్డులు

● చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల/నవాబుపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల ఎండీవో కార్యాలయంలో మండలంలోని పదిమంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రజలందరికీ కొత్త రేషన్ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 25 మందికి రూ. 11లక్షల 3వేల 500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. తహసీల్దార్ బి. కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, రాములు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే నవాబుపేట ఎంపీడీవో కార్యాలయంలో రేషన్‌కార్డుల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. 19మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, ఎంపీడీవో అనురాధ, డీటీ శ్రీలత, ఆర్ఐలు రజిత, రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి

దోమ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగన్‌పల్లి రంగనాథ్ కుంట నుంచి నీరు వృథాగా పోతోందని, దానికి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం తహసీల్దార్ గోవిందమ్మకు వినతిపత్రం ఇచ్చారు. కొందరు రైతులు తమ పొలాలు మునుగకుండా తూము నుంచి నీటిని వదుళ్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మహాలక్ష్మి సంబరాల్లో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ బస్ స్టాండ్‌లో డీఎం అరుణ ఆధ్వర్యంలోఆర్టీసీ 'మహాలక్ష్మి' సంబరాలు నిర్వహించారు. హాజరైన సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 200కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

వికారాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): 1947 దేశ విభజన సమయంలో కాందీశీకులు వదిలివెళ్లిన సుమారు 7ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ఆ భూమిలో ఇప్పుడు ఎకరం 10గంటల భూమిని కొందరు కాజేసేందుకు దొంగ పట్టాలు సృష్టించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అదనపు కలెక్టర్, మునిసిపల్ ప్రత్యేకాధికారి సుధీర్‌కుబీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడెకరాల్లో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఇతర అవసరాలకు వాడారన్నారు. భూమి కాజేసేవారికి అనుకూలంగా హైకోర్టు తీర్పు వచ్చిందని, ఈ భూమి 100శాతం ప్రభుత్వానిదే అన్నారు. మునిసిపాలిటీ హైకోర్టులో అప్పీల్ చేయాలని అధికారిని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మారుతీకిరణ్, కేశవులు, ఉగ్గ నర్సింహ, ప్యాట శంకర్, సుధాకర్, మోహన్‌రెడ్డి, రాఘవేందర్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

దుద్యాల: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డిని మండలంలోని హకీంపేట్‌కు చెందిన నాయకులు వికారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శివకుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ సుధీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



బాణాపూర్ గ్రామంలో మల్లప్పకుంట చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్

మల్లప్ప చెరువు లీకేజీ

● సందర్శించిన తహసీల్దార్...మరమ్మతులకు ఆదేశం

యాలాల, జూలై 23, (ఆంధ్రజ్యోతి) : యాలాల మండల పరిధిలోని బాణాపూర్ గ్రామంలో గల మల్లప్ప చెరువు లీకేజీలకు గురైంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా చెరువుకుంటలో నీరు చేరింది. పెద్ద ఎత్తున మల్లప్పకుంటలో నీరు చేరడంతో చెరువు కట్ట కింద భాగంలో నుంచి వర్షం నీరు లీకేజీ అవుతుంది. దీంతో గ్రామస్తులు యాలాల తహసీల్దార్‌కు సమాచారం అందించారు. తహసీల్దార్ వెంకటస్వామి మల్లప్పకుంట చెరువును పరిశీలించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించారు.



ఎన్కతలలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

మోమిన్‌పేట్, జూలై23(ఆంధ్రజ్యోతి): ఎన్కతల గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర పరిశీలకులు కృష్ణ, భారత్‌మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రవి, డీఎల్పీవో సంధ్యారాణి బుధవారం సందర్శించారు. పారిశుధ్య పనులు, మరుగుదొడ్ల నిర్వాహణ, ఇంకుడు గుంతలు, తడి, పొడిచెత్త సేకరణ, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మధ్యాహ్న భోజనం గురించి గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సిములు, సిబ్బంది గంగయ్య, పోచయ్య, నాగరాజు, ఏఎన్ఎం మంజుల, అంగన్‌వాడీ టీచర్, వీవోఏలు, పాల్గొన్నారు.

దోమకాటుతో జాగ్రత్త

» ప్రాణి చిన్నదే.. తలపెట్టే హాని పెద్దది! » కుట్టకుండా చూసుకోవాలి

కొడంగల్ రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రెండక్షరాల చిన్న ప్రాణి దోమ. అయితే మనిషికి చేసే ముప్పు మాత్రం పెద్దది. వర్షాకాలంలో అన్ని రకాల అంటు వ్యాధులను దోమ మనుషులకు చేరవేస్తూ ఆస్పత్రుల పాల్జేస్తోంది. అయితే జాగ్రత్తలతో దోమకాటుకు గురికాకుండా చూసుకోవచ్చని వైద్యాధికారులు సూచిస్తున్నారు. నీటి నిల్వ ప్రాంతాల్లోనే దోమలు గుడ్లు పెట్టి సంతానాన్ని వృద్ధి చేస్తాయి. ఈ గుడ్లు వాతావరణంలోని వేడితో మూడు రోజుల్లో లార్వాగా బయటకొచ్చి ప్యూపాగా మారతాయి. అనంతరం దోమలుగా మార్పుచెందుతాయి. చాలా రకాల అంటు వ్యాధులు దోమ వల్లే వ్యాపిస్తాయి. దోమ కాటుతో ప్రధానంగా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా, బోధకాలు తదితర వ్యాధులు వస్తాయి. ఈ వ్యాధులున్న వారిని దోమలు కాటేసిన అనంతరం ఇతరులను కుడితే ఆ వైరస్‌తో ఆరోగ్యవంతులకు సైతం వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధుల లక్షణాలన్నీ దాదాపు ఒకే రకంగా ఉంటాయి.



పాటిమీదిపల్లిలో ఇళ్ల మధ్య పేరుకున్న గుర్రపుడెక్క

ఇవి తప్పక పాటించాలి

- ఆవాస ప్రాంతాల వద్ద, ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇళ్లలో ప్రతీ మూలలో వెలుతురరొచ్చేలా చూసుకోవాలి.
- దోమలు కట్టుకుండా దోమ తెరలను వాడాలి.
- ఇళ్లలో వాడే కూలర్లలో ఎప్పటికప్పుడు నీటిని మార్చాలి.
- పిల్లలను పడుకోబెట్టినప్పుడు కాళ్లు, చేతులకు దోమల నివారణ క్రీములను రాయాలి.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



దోమలు కుడితే వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలి. ఇంటి సమీపంలో ఎక్కడా నీటి నిల్వ ఉంచొద్దు. గుంతలు, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకోవాలి. ఎవరైనా అస్వస్థకు గురైతే వెంటనే ఆస్పత్రిలో చికిత్స పొందాలి.

- డాక్టర్ చందనప్రియ, ప్రభుత్వ ఆసుపత్రి, కొడంగల్



పోచారంలోని టౌన్‌షిప్‌లో పర్యటిస్తున్న రాజీవ్ స్వగృహ ఎండీ వీపీ గౌతమ్

రాజీవ్ సద్భావన టౌన్‌షిప్‌లో ప్లాట్ల విక్రయాలు

● రాజీవ్ స్వగృహ ఎండీ వీపీ గౌతం వెల్లడి

ఘట్‌కేసర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేద మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరల్లో ఇళ్లను అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ అన్నారు. బుధవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌సద్భావన టౌన్‌షిప్‌లో ఆయన పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ నిర్మించిన ఈ టౌన్‌షిప్‌ను 30ఎకరాల్లో 60శాతం ఓపెన్‌స్పేస్‌తో పూర్తి చేసినట్లు వివరించారు. ఈ ఇళ్లను వేలం వేయకుండా పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సింగిల్ బెడ్‌రూం ఇంటిని రూ. 13 లక్షలకు, డబల్‌బెడ్ రూం ఇళ్లు రూ, 25లక్షలకు వస్తుందన్నారు. ప్రస్తుతం ఉప్పల్ నుంచి రావడానికి అరగంట సమయం పడుతున్నప్పటికి నారపల్లి – ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే కేవలం 10నిముషాల్లో ఉప్పల్ చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పోచారం సద్భావన టౌన్‌షిప్‌లో 255 సింగిల్ బెడ్‌రూంలు. 350డబల్ బెడ్‌రూంలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సింగిల్ బెడ్‌రూం కోసం రూ.లక్ష, డబల్ బెడ్‌రూం కోసం రూ, 2 లక్షలు ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ అప్పలరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో విసిగిపోయిన ప్రజలు



సమావేశంలో మాట్లాడుతున్న కోట్‌పల్లి బీఆర్ఎస్ నాయకుడు అనిల్

వికారాబాద్/కోట్‌పల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన, చేస్తున్న మోసాలతో ప్రజలు విసిగిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో బంట్వారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దుర్గం చెరువు మల్లేశం, కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్‌ల తరఫున కాంగ్రెస్, బీజేపీల నాయకులు పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వెళ్లి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ కండువాలు కప్పారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలన కోరుకుంటున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నుంచి భారీఎత్తున బీఆర్ఎస్‌లో చేరతారన్నారు. కాగా కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వికారబాద్‌కు చెందిన యువ నాయకుడు చైతన్య రూపొందించిన 'యువ చైతన్యం' పాటల సీడీని కేటీఆర్ ఆవిష్కరించారు. సమావేశంలో మాజీ మంత్రులు సబితారెడ్డి, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, నాయకులు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, శుభప్రద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోట్‌పల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న మోసాలతో ప్రజలు విసిగిపోతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల నుంచి 150 మంది నాయకులు బీఆర్ఎస్ లో చేరారని తెలిపారు.

సింహగర్జన సభకు తరలిరండి

పెద్దేముల్, జూలై23(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో ఆగస్టు 2న నిర్వహించే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.నర్సిములు పిలుపునిచ్చారు. ఇందూరులో బుధవారం దివ్యాంగులు, వృద్ధులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వృద్ధుల పింఛన్‌ను 4వేలకు, దివ్యాంగులకు 6వేలకు పెంచాలన్నారు. హక్కుల సాధన కోసమే ఈ సింహగర్జన సభ నిర్వహిస్తామన్నారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. మండలం నుంచి పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, జూలై23(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మోత్కుళ్లగూడ నుంచి కేసారం వరకు బీటీ రోడ్డు, రూ.58 లక్షలతో శ్రీనివాసులగూడ నుంచి మజీద్ మామిడిపల్లి వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, బండోనిగూడ నుంచి తండా వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. శివశంకర్‌గౌడ్, నర్సింలు, పసుల బుచ్చయ్య, కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కావలికృష్ణ, సత్తయ్య, నర్సింలు, హరినాథ్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, రవిందర్, శేఖర్, శ్రీశైలం, శివ, సాములయ్య, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానంతో సాటి మనిషికి పునర్జన్మ

షాద్‌నగర్ అర్బన్ : రక్తదానం చేయడమంటే తోటి మనిషికి పునర్జన్మ ఇచ్చినట్టేనని ఎమ్మెల్యే శంకర్ అభిప్రాయపడ్డారు. చటాన్‌పల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ చేగూరి రాజేందర్‌రెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకుని రెడ్డిసేవా భవన్‌లో రక్తదానం శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సంకల్ప్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. 34 మంది రక్తదానం చేశారు. 250 మందికి కంటి పరీక్షలు, 300 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.మదన్‌మోహన్ రెడ్డి, రాజు, శివనాగయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, అశోక్, నర్సింహారెడ్డి, వెంకట్‌నాయక్, ఎర్ర శ్రీనివాస్, చందు పాల్గొన్నారు.



మోత్కుళ్లగూడలో బీటీపనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్



యాచారంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

తెలంగాణలో అధికారంలోకి వస్తాం

● టీడీపీ రాష్ట్ర నాయకుడు అంజిరెడ్డి

యాచారం, జూలై 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని, పార్టీకి పూర్వవైభవం తేవడానికి ప్రతీ కార్యకర్త శ్రమించాలని తెలుగుదేశం పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చిత్తశుద్ధితో పని చేస్తూ పార్టీని అధికారంలోకి తేవడానికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించాలని, తన వంతు సహకారమందిస్తానని అన్నారు. నక్క మహేందర్‌యాదవ్, కొంగళ్ల మల్లారెడ్డి, కొంగర జంగయ్య, కె.యాదయ్య, బుచ్చిరెడ్డి, చింతకింది చక్రపాణి, శ్రీరాములు, గౌరనర్సింహ, నారిమల్ల యాదయ్య, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ

తెలుగుదేశం పార్టీకి మండల కమిటీ నియమించారు. అధ్యక్షుడిగా గౌర నర్సింహ, ఉపాధ్యక్షుడిగా నక్క మహేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అర్జున్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నాళ్ల నరసింహగుప్తా, నర్రె యాదగిరి, కార్యదర్శులు కె.యాదయ్య రవీందర్, డి.యాదయ్య, కోశాధికారిగా దాసులు ఎంపికయ్యారు.

వానలు.. అప్రమత్తంగా ఉండాలి

● మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల అప్రమత్తతే ప్రమాదాల నివారణకుఆయుధమని, వర్షాల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. బుధవారం తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొన్ని కాలనీలు జలమయ్యే అవకాశాలున్నందున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

తాండూరులో హస్తకళా ప్రదర్శన



తాండూరు, జూలై 23(ఆంధ్ర జ్యోతి): హస్తకళల ప్రోత్సాహానికి తాండూరులో 'చేనేత వస్త్రం' పేరిట ఎగ్జిబిషన్‌ను చేనేత, జౌళి శాఖ ఏర్పాటు చేసింది. తాండూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎగ్జిబిషన్స్ కొనసాగుతోంది. 'స్వదేశీ హస్తకళలు' నిర్వహిస్తున్న మేళాలో అమ్ముతున్న దుస్తులు ఆకట్టుకుంటున్నాయి. పట్టు, ఫ్యాన్సీ, డిజైనర్, జరీ, పట్టు చీరలు, పోచంపల్లి డ్రెస్‌మెటీరియల్, షూటింగ్, షర్టింగ్స్, అలాగే కట్లు, అల్లికల వస్తువులు అమ్ముతున్నారు. పది రాష్ట్రాల చేనేత కళాకారులు చేసిన వస్తువులు, దుస్తులను ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తున్నారు.

'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

ఆమనగల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలని సూచించారు. మాడ్గుల మండల బీజేపీ కార్యకర్తల సమావేశం బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ బలోపేతం, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం స్థానిక సమస్యలపై చర్చించారు. ఆచారి మాట్లాడుతూ మోదీ పాలనా దక్షతతో దేశం పదేళ్లలో అద్భుత విజయాలు సాధించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిందని, బీఆర్ఎస్‌ను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌని మల్లేశ్‌గౌడ్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ నర్సింహ్మ, రాష్ట్ర నాయకుడు మట్ట వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీలో 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఖర్చు రూ.6,700 కోట్లు అని అన్నారు. విజయవంతంగా కొనసాగుతున్న మహాలక్ష్మి పథకం అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 97 ఆర్టీసీ డిపోలతో పాటు 341 బస్‌స్టేషన్లలో సంబురాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమనగల్లులో నిర్వహించిన సంబురాలలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలు అవుతుందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సంక్షేమ పథకాలు అందించనున్నట్లు తెలిపారు. డీఎం సుభాషిణి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, నాయకులు భూపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, ఆనంద్, శ్రీకాంత్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

ఉత్సవానికి రావాలని ఆహ్వానం

ఘట్‌కేసర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పలు వార్డుల్లో ఈ నెల 27న జరిగే బోనాల ఉత్సవాలకు రావాలని కోరుతూ బుధవారం మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. బోయిన్‌పల్లిలో గల నివాసంలో ఎమ్మెల్యేను కలిశారు. ఆదివారం పోచారం, యనంపేట్, అన్నోజిగూడ, ఆర్జీకే కాలనీల్లో బోనాలు, ఫలాహార బండ్ల ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నల్లవెల్లి శేఖర్, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రశాంత్, చక్రపాణి ఉన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలి

దౌల్తాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో కూడిన బదిలీలకు ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రెండో పీఆర్సీ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పాలకులు గత ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కేజీబీవీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పేస్కేల్‌ను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, ఉశన్న, రమేశ్ పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రకళ

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించాలి

» చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ

మొయినాబాద్ రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టబోయే గోశాల నిర్మాణానికి ఎన్కేపల్లి రైతులు సహకరించాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ కోరారు. బుధవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆర్డీవో, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ గ్రామానికి చేరుకున్నారు. సాగులో ఉన్న భూములను ఇచ్చేదిలేదని రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ముందుగా 300 గజాల స్థలాలు ఇచ్చిన తరువాతనే ఇక్కడ గోశాల నిర్మాణం చేయడం జరుగుతుందని వారికి వివరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎన్కేపల్లి గ్రామస్తులు స్వాగతించాలని కోరారు.అంతకు ముందు మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో, తహసీల్దార్, ఏసీపీ కిషన్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులతో పాటు గ్రామ రైతులతో మాట్లాడారు.


వైపీఆర్ కమాన్ వద్ద ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్


చర్లపటేల్‌గూడలోని నోరుతెరుచుకున్న మ్యాన్‌హోల్

ఆదిబట్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్ గూడ, ఆదిబట్ల మున్సిపాలిటీలో మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వర్షకాలం నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్డు వేసి మ్యాన్‌హోల్స్ నిర్మాణం పూర్తిచేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డుపై నీటితో పాటు మురుగు ప్రవహిస్తోంది. ఈ క్రమంలో మ్యాన్‌హోల్స్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. టీసీఎస్ నుంచి ఆదిబట్లకు వెళ్లే రోడ్డులో నిత్య మురుగు నిలుస్తుండటంతో అపరిశుభ్రత, దుర్వాసనతో స్థానికులకు, వాహనదారులకు, టీసీఎస్ ఉద్యోగస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

దోమ, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీవో గ్యామానాయక్, ఎంఈవో వెంకట్, డీటీ నర్సిములు అన్నారు. బుధవారం దోమలోని బాలికల పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. బాలికలతో కలిసి భోజనం చేశారు.

డిమాండ్లను నెరవేర్చాలి

కీసర రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భారత్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) 70వ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ జెడ్పీటీసీ సురేష్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, బీఎంఎస్ ప్రతినిధులు రాఘవేందర్, పురుషోత్తం, ప్రవీణ్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



ఓంకారేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చౌడాపూర్ మండలంలోని మందిపాల్‌లోని ఓంకారేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలు బాగుండాలని కోరుకున్నారు. గణపతి వీరభద్ర, నందీశ్వర మహాన్యాస, ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

చౌడాపూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి)



షూటింగ్ స్పాట్‌గా ఎర్రవల్లి

వికారాబాద్ మండలంలోని ఎర్రవల్లి గ్రామం షూటింగ్ స్పాట్‌గా మారుతోంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన నాగుల ఎలమ్మ ఆలయం పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండడంతో సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా మారింది. బుధవారం 'నేను నా లల్లి' వెబ్ సిరీస్ చిత్రీకరణ జరుగగా గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు షూటింగ్ చూసేందుకు తరలివచ్చారు.

వికారాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి)

వరద కష్టాలు తీరుస్తాం

తాండూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): తాండూరులో ప్రజలు ఎదుర్కొంటున్న వరద కష్టాలను త్వరలోనే పరిష్కరిస్తామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బుధవారం చిలుకవాగు బ్రిడ్జి మార్కేండయ కాలనీని పరిశీలించారు. రూ.16కోట్లతో బ్రిడ్జి పనులు చేస్తున్నామని, దీంతో జలమయమయ్యే ప్రాంతాలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఆయనతో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, నాయకులు వికాస్‌జోషి, విష్ణు, కాలనీ పెద్దలు ఉన్నారు.

బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారమందించాలి

» కలెక్టర్‌కు కడ్తాల రైతుల వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు

కడ్తాల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం అందించాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రైతులు, పలువురు నాయకులు కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీదర్ నుంచి మహేశ్వరం వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్ టవర్లు, లైన్ల మూలంగా కడ్తాలతో పాటు సమీప గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కడ్తాల ప్రాంతంతో మార్కెట్ ధర గజానికి రూ.20వేలు పలుకుతుందని, దానికి అనుగుణంగా పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో కడ్తాల మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు, రైతులు రాములు, పెంటారెడ్డి, శ్రీరాములు, పర్వత్‌కుమార్, శ్రీశైలం, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జీఎస్ కోహ్లీ

గురునానక్ వర్సిటీలో బీటెక్ ప్రోగ్రాంలు

» సాప్ టెక్నాలజీస్ సమన్వయంతో ప్రారంభం

ఇబ్రహీంపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడంతోపాటు నూతన ఆవిష్కరణలు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీ, సాప్ (ఎస్ఏపీ) టెక్నాలజీస్ సమన్వయంతో నూతనంగా బీటెక్ ప్రోగ్రాంలను ప్రారంభించినట్లు గురునానక్ యూనివర్సిటీ చాన్స్‌లర్ సర్దార్ గగన్‌దీప్‌సింగ్ కోహ్లీ తెలిపారు. బుధవారం వర్సిటీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రోగ్రాంను ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య సమన్వయం ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈ ప్రోగ్రాం ప్రవేశపెట్టామన్నారు. ఇది ఒక సాధారణ కోర్సు కాదని.. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ యుగంలో విద్యార్థులు ప్రపంచ ప్రొఫెషనల్స్‌గా ఎదగడానికి ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. సాప్ ఇండియన్ సబ్ కాంటినెంట్ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం, సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ ప్రోగ్రాం తీసుకువచ్చామన్నారు. విద్యార్థులకు ఇది ఒక ప్రాక్టికల్ శిక్షణగా ఉపయోగపడుతుందని, డిజిటల్ ఎకానమీకి అనుగుణంగా కోర్సులను రూపొందిస్తూ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెంచే దిశగా కృషి జరుగుతుందన్నారు. ప్రముఖ ఐటీ సంస్థలైన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, యూఎస్‌టీ వంటి పలు సంస్థల ప్రతినిధులతోపాటు వైస్ చాన్స్‌లర్ డా.హెచ్.ఎస్ సైనీ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వినయ్ చోప్రా తదితరులు పాల్గొన్నారు.

యూరియాను దుర్వినియోగం చేయొద్దు

నందిగామ/చౌదరిగూడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): యూరియాను పంటల సాగుకు తప్ప ఇతరత్రా అవసరాలకు వినియోగించొద్దని అధికారులు సూచించారు. ఈమేరకు నందిగామ మండల కేంద్రంలోని యూరియాను వినియోగించే శ్రీ లక్ష్మీనివాస్ ప్లేట్స్, మిల్క్‌ప్లస్ ఫుడ్, హర్ష ప్లైవుడ్ పరిశ్రమను బుధవారం వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించే యూరియాను పరిశ్రమల్లో తయారుచేసే పదార్థాలు, వస్తువుల్లో వినియోగించవద్దని నిర్వాహకులకు సూచించారు. రైతులు పంటలకు వినియోగించే యూరియాను పరిశ్రమలకు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయశాఖ అధికారులు ఉష, రమాదేవి, రామశివరావు, పోలీస్ అధికారి గోపాల్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే యూరియాను ఇతరత్రా అవసరాలకు వినియోగించడం నేరమని కొందుర్గు ఏవో సురేష్‌రెడ్డి అన్నారు. కోళ్ల ఫారాల్లో యూరియాను వినియోగిస్తున్నారనే సమాచారంతో మండల పరిధిలోని తంగెళ్లపల్లి గ్రామ శివారులోని గీత పౌల్ట్రీ పరిశ్రమ, నాగార్జున హేచరీ‌ఎలో తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో యూరియా వినియోగం లేనట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎస్సై రవీందర్ నాయక్‌లు పాల్గొన్నారు.


ప్లైవుడ్ పరిశ్రమను తనిఖీ చేస్తున్న వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు

లారీ ఆపి డబ్బు డిమాండ్

● ఏఎంసీ చైర్మన్ అనుచరుడి హల్‌చల్ ● పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

మూడుచింతలపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్ పీఏను అని చెప్పుకుంటూ కాంగ్రెస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి కీసరి భానుచందర్ వసూళ్లకు పాల్పడుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి భానుచందర్, మరో ఇద్దరు ఓ టిప్పర్ లారీని ఆపి డబ్బు డిమాండ్ చేశారు. డబ్బులివ్వలేదని డ్రైవర్, క్లీనర్, లారీ ఓనర్‌ను, అతడి బావమరిదిని కర్రలతో కొట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఉప్పర్‌పల్లి రామకృష్ణకు చెందిన టిప్పర్‌లో డ్రైవర్ రామాంజనేయులు, క్లీనర్ షాబాజ్‌లు దత్తాయిపల్లి వైపు వెళ్తున్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లక్మాపూర్ వద్ద పోలీస్ సైరన్‌తో కారు(టీఎస్08 హెచ్‌జీ4449)లో వచ్చిన వారు లారీని అడ్డుకున్నారు. తాము ఆర్టీఏ, మైనింగ్ అధికారులమని కర్రలతో కొడుతూ డబ్బు డిమాండ్ చేశారు. దీంతో డ్రైవర్ రామకృష్ణకు ఫోన్ చేశాడు. రామకృష్ణ లక్మాపూర్‌లో ఉండే తన బావమర్ది అనిల్‌కు ఫోన్‌చేశాడు. అనిల్ లారీ వద్దకు చేరుకుని కారులోని వారు లక్మాపూర్‌కు కీసరి భానుచందర్, అతడి తమ్ముడు వేణు, మేడబోయిన రాజులుగా గుర్తించారు. మీకెందుకు డబ్బులివ్వాలని ప్రశ్నించగా భానుచందర్, అతడి అనుచరులు రామాంజనేయులు, అనిల్‌లపై దాడి చేశారు. ఈలోగా అక్కడికి చేరుకున్న రామకృష్ణపైనా దాడి చేశారు. బాధితులు ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల రాకతో నిందితులు పారిపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కొద్ది రోజులుగా భానుచందర్ పోలీస్ సైరన్ కారుతో వాహనాలను ఆపుతూ డబ్బు డిమాండ్ చేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. కాగా దీనిపై నర్సింహులుయాదవ్ స్పందిస్తూ.. ఈ అక్రమ వసూళ్లతో తనకు సంబంధం లేదన్నారు. భానుచందర్ కాంగ్రెస్ కార్యకర్తగానే తెలుసన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

మోమిన్‌పేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దైవచింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత పొందుతారని ప్రముఖ వక్త నల్లవోలు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం చక్రంపల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రముఖ కవి గంటా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. చరిత్రను అధ్యయనం చేస్తూ, జరుగుతున్న పరిణామాలను గ్రహిస్తూ జాగృతం కావాలన్నారు. డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, అంజయ్యయాదవ్, ఆధ్యాత్మికవేత్త వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో 150మంది కవులు కవితా గానం విన్పించారు. కార్యక్రమంలో తాండూర్, పరిగి, కొడంగల్, హైదరాబాద్, షాద్‌నగర్, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాల కవులు, బందెప్పగౌడ్, విశ్వనాథం, రాజు, వెంకట్, రాఘవేంద్రచారి, సత్యం, మాణిక్యరావు, రాథోడ్, శ్రీనివాస్, భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తికోసం తండ్రిని చంపిన తనయుడు

వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండలం గొట్లపల్లిలో ఘటన

పెద్దేముల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలు మంటకలిసి పోతున్నాయి. ఆస్తికోసం అయిన వారిని సైతం చంపడానికి వెనకాడడం లేదు. ఇలాంటి సంఘటనే వికారాబాద్ జిల్లా , పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తలారి హన్మంతుకు ఐదుగురు కుమారులు. హన్మంతు కొంతకాలం క్రితం పక్షవాతానికి గురై ఇటీవలే కాస్త కోలుకుని తనపనులు తాను చేసుకునే స్థితికి చేరుకున్నాడు. ఆయన ఐదుగురు కుమారుల్లో రెండో కుమారుడు రవి జులాయిగా తిరుగుతుండేవాడు. తాగుడుకు బానిసై డబ్బుల కోసం తరుచూ తండ్రిని వేధించేవాడు. తండ్రి హన్మంతు పేరిట కొంత ఆస్తి ఉంది. డబ్బులు ఇవ్వకపోవడంతో రవి కన్ను ఆస్తిపై పడింది. దీంతో తనకు డబ్బులు ఇవ్వకపోయినా తనకు రావాల్సిన ఆస్తిలో తన వాటానైనా తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి తెచ్చేవాడు. బుధవారం తండ్రీకొడుకుల మధ్య ఇదే విషయమై గొడవ జరిగింది. తాను ఉన్నంతవరకు ఎవరికి ఆస్తిలో వాటా ఇచ్చేది లేదని తేల్చడంతో కోపోద్రిక్తుడైన రవి తన తండ్రిపై దాడికి దిగి హత్యచేశాడు. అనంతరం స్వయంగా రవినే 100కు డయల్ చేసి తనతండ్రిని తానే హత్య చేశానని చెప్పి అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడు రవి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ.వేణుకుమార్ తెలిపారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం పూర్తి చేయండి

ఇబ్రహీంపట్నం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండు వద్ద నిర్మిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం పనులను వెంటనే పూర్తిచేయాలని బీజేపీ నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రమందజేశారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న భవనాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారని, మూడేళ్ళయినా పూర్తి చేయలేకపోతున్నారని బీజేపీ మండలాధ్యక్షుడు ముత్యాల మహేందర్ అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకుగా సౌకర్యంగా లేదన్నారు. పార్కింగ్ సౌకర్యంలేక రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేందర్, సురేష్, మల్లేష్, గోవర్ధన్, కిష్టయ్య తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మాడ్గుల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లచెర్వు గ్రామానికి చెందిన కట్ట సతీష్ కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఈమేరకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఆయనకు రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఎమ్మెల్యే ఆయన నివాసంలో కట్ట సతీష్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయరెడ్డి అందచేశారు. వడ్డేపల్లి నవీన్‌గౌడ్, జగన్‌గౌడ్‌లు ఉన్నారు.

పెద్దవాగుపై వంతెన నిర్మించాలి

కేశంపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాటిగడ్డ వద్ద పెద్దవాగుపై వంతెన నిర్మించాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) మండలాధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వాగు వద్దకు వెళ్లి వరద ఉధృతిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేశంపేట మండల కేంద్రానికి అత్యంత సమీపంలో పాటిగడ్డ గ్రామం ఉందని, గ్రామ సమీపంలో నుంచి వాగు పారుతుంటుందని తెలిపారు. పాటిగడ్డ గ్రామంలో కేజీబీవీలో ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారని, వర్షాకాలంలో విద్యార్థులను కలవడానికి వచ్చే తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాగు పారితే గ్రామానికి రాకపోకలు పూర్తిగా ఆగిపోతాయిని తెలిపారు. ప్రభుత్వం వాగుపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. కొప్పు శ్రీకాంత్, పాపకంటి అభిరామ్, భాను తదితరులు ఉన్నారు.



పాటిగడ్డ వద్ద వాగును పరిశీలిస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

వదలని వర్షం

(ఐదో పేజీ తరువాయి)



యాచారం : మేడిపల్లిలో వరి నాట్లు వేసే పనిలో కూలీలు

అత్యధికంగా 84.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే ధారూరులో 80.0 మిల్లీమీటర్లు, పరిగిలో 75.5మిల్లీమీటర్లు, యాలాలలో 73.3 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్‌లో 75.3 మిల్లీమీటర్లు, తాండూరులో 67.8 మిల్లీమీటర్లు, పెద్దేముల్‌లో 44.8 మిల్లీమీటర్లు, ధావలాపూర్‌లో 37.8 మిల్లీమీటర్లు, దోమలో 34.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండలో అత్యధికంగా 63.8 మిల్లీమీటర్లు నమోదైంది. శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో 58.0 మిల్లీమీటర్లు, కొందుర్గులో 50.5 మిల్లీమీటర్లు, లింగంపల్లిలో 53.0 మిల్లీమీటర్లు, చందానగర్‌లో 46.3 మిల్లీమీటర్లు, శేరిలింగంపల్లి మండలం అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 42.5 మిల్లీమీటర్లు, షాబాద్‌లో 40.5మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. అదేవిధంగా చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో 37.5 మిల్లీమీటర్లు, శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో 36.8మిల్లీమీటర్లు, మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 32.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొయినాబాద్‌లో 28.5 మిల్లీమీటర్లు, చేవెళ్లలో 26.3 మిల్లీమీటర్లు, కందుకూరు మండలం రాచేలూరులో 24.5మిల్లీమీటర్లు, శంకర్‌పల్లిలో 23.5 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో 40.5 మి.మీ. నమోదు కాగా, కీసరలో 30.8 మిల్లీమీటర్లు, కూకట్‌పల్లిలో 29.8 మిల్లీమీటర్లు నమోదైంది. బాచుపల్లిలో 28.8 మిల్లీమీటర్లు, మేడ్చల్‌లో 21.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బైక్‌తో వాగులో పడిన వ్యక్తి

చౌదరిగూడ : కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన కావలి నర్సింహులు తన బైక్‌పై ఉత్తరాస్‌పల్లిలో జరిగిన బోనాల వేడుకకు వెళ్లాడు. ఈమేరకు మంగళవారం రాత్రి తిరిగి గ్రామానికి వస్తుండగా కేబుల్ లైన్ తగిలి గ్రామ శివారులోని ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో బైక్‌తో సహా పడిపోయాడు. వెంటనే అతను బైక్‌ను వదిలేసి వాగు బయటికి వచ్చాడు. వాగులో పడిన బైక్‌ను గ్రామానికి చెందిన కొందరు యువకులు బుధవారం ఉదయం బయటకి తీశారు.

ముమ్మరంగా వరినాట్లు

ఇబ్రహీంపట్నం/యాచారం : ఇబ్రహీంపట్నం, యాచారం మండలాల పరిధిలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి. గడ్డమల్లాయాగూడ, మేడిపల్లిలో ఇళ్ల మధ్య వర్షం నీరు నిలిచింది. మేడిపల్లి, తాటిపర్తి, కుర్మిద్ద, మల్కీజ్‌గూడ, దర్మన్నగూడ, చిన్నతూండ్ల, నందివనపర్తి, నజ్దిక్‌సింగారం గ్రామాలలో వరి నాట్లు ముమ్మరంగా వేశారు. అదేవిధంగా యాచారం మండల కేంద్రంలోని నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలవడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఆవులు మృత్యువాత



మృతి చెందిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు సేవ్య దంపతులు

కడ్తాల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రెండు ఆవులు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కడ్తాల మండలం గానుగమర్ల తండాకు నేనావత్ సేవ్య రోజూ మాదిరిగా తనకు చెందిన ఆవులను పొలం వద్ద మేపుతున్నాడు. అవి మేత మేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాయి. ఈమేరకు చనిపోయిన ఆవులను పశువైద్యాధికారి భాను నాయక్ పరిశీలించారు. వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు సేవ్యనాయక్ కోరాడు.

విచారణ చేసి న్యాయం చేయాలి

● తప్పుడు ఫిర్యాదుపై బాధితుడు

షాద్‌నగర్ రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు తనపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని, విచారణ చేసి న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ మురళీధర్‌రెడ్డి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 81లో తనకు వంశపారంపర్యంగా వచ్చిన నాలుగెకరాల భూమి ఉందని తెలిపారు. ఆ భూమిలో నుంచి తన తండ్రి గౌడ కులస్తుల కోసం ఎనిమిది గుంటల భూమి శ్మశానవాటిక కోసం దానం చేశారని తెలిపారు. అయితే, ఆ 8 గుంటల భూమిపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, దానికి అదనంగా ఉన్న నా భూమిలో నుంచి నడుస్తున్నారని తెలిపారు. అదీకాకుండా నాలుగెకరాల్లో కొంత ఆక్రమించి రోడ్డు పెద్దగా వేయాలని చూస్తున్నారని గౌడ సంఘం నాయకులపై ఫిర్యాదులో పేర్కొన్నారు. దానివల్ల తనకు నష్టం జరుగుతుందని అభ్యంతరం తెలిపానని, తాను సమాధులను ధ్వంసం చేయలేదని, విచారణ చేసి న్యాయం చేయాలని ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



కందుకూరు : పులిమామిడిలో మొక్కలు నాటిన అమెజాన్ ప్రతినిధులు



యాచారం : మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రాధారాణి తదితరులు

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు చెట్లు ఎంతో దోహదపడుతాయని, ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అమెజాన్ సంస్థ ప్రతినిధి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పులిమామిడిలో అమెజాన్ సంస్థ సహకారంతో సెర్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని సంస్థ ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ చెట్లను రక్షిస్తే అవి మనలను రక్షిస్తాయన్నారు. పులిమామిడిలో మొత్తం 13 వందల మొక్కలు నాటడమే లక్ష్యంగా అమెజాన్ సంస్థ ముందుకు సాగుతుందన్నారు. అమెజాన్ ప్రతినిధులు లత, వంశీకృష్ణ, శ్రీ రామ్, సురేష్, రమేష్, పార్థసారధి, సుధాకర్, ధనుంజయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి కాపాడాలి

యాచారం : ప్రతీ ఒక్కరు తమకు తోచినన్ని మొక్కలు నాటి కాపాడాలని ఎంపీడీవో రాధారాణి కోరారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని తమ్మలోనిగూడ, కొత్తపల్లి, గున్‌గల్‌లో ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. గున్‌గల్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండలంలో సుమారు లక్ష మొక్కలు నాటేందుకు కృషి చేస్తున్నామన్నారు. యువకులు. విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను స్వీ కరించాలన్నారు. పాఠశాలల ఆవరణల్లో పండ్ల, పూలమొక్కలు నాటాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో ఎంఈవో పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రేషన్ కార్డుల వివరాలు సేకరించాలి : తహసీల్దార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆజంఅలీ

కేశంపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి పెండింగ్ వివరాలు సేకరించాలని కేశంపేట తహసీల్దార్ ఆజంఅలీ సూచించారు. ఈమేరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో 2,616 రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్నారని, అందులో 1,700 దరఖాస్తులను పరిశీలించామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న వివరాలను త్వరగా సేకరించాలని సూచించారు. అలాగే ఓటరు లిస్టును త్వరలోనే కార్యదర్శులకు అందిస్తామని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం



చేవెళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను బయటకు పంపిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



ఇబ్రహీంపట్నం : ర్యాలీలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/చేవెళ్ల/ఇబ్రహీంపట్నం/షాద్‌నగర్ అర్బన్/మాడ్గుల, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ ఎస్ఎఫ్ఐ, సీఐటీయు ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో మంగళవారం చేపట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. పాఠశాలల, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఆయా మండల కేంద్రాలలో విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు ఎంఈవోలకు అందజేశారు. విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, అద్దె భవనాలలో నడుస్తున్న గురుకులాలకు సొంతభవనాలు నిర్మించాలని, రాష్ట్రంలో విద్యాశాఖమంత్రిని నియమించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డీఈవో, లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ అధికారులకు ఎస్ఎఫ్ఐ, సీఐటీయు నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శివకుమార్, రోహిత్, కిరణ్, తదితరులున్నారు. చేవెళ్ల మండలంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్, చేవెళ్ల మండల కార్యదర్శి చందు, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేశ్, మండల కార్యదర్శి శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో చేవెళ్లలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు, టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నవీన్, వరుణ్, తేజ, తదితరులున్నారు. పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయడంతోపాటు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ ఇబ్రహీంపట్నంలో ప్రశాంతంగా జరిగింది. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, తరంగ్‌లు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలన్నారు. విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని, పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాల్సి ఉందన్నారు. లక్ష్మణ్, రామ్‌చరణ్, రాకేష్, మధు తదితరులున్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మాడ్గుల మండల కార్యదర్శి శివ అన్నారు. మండలంలోని స్కూళ్లను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు బడక శివ కుమార్, విద్యార్థి నాయకులు రోహిత్, కిరణ్, వెంకన్న, వంశీ, భాష, సత్యం తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బస్టాండ్ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో!

(ఐదో పేజీ తరువాయి)

ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ బస్సుల కోసం గంటల తరబడి రోడ్ల పక్కనే పడిగాపులు పడాల్సి వస్తోంది. బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం కోసం తాగు నీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. నందిగామ మండలకేంద్రం నుంచి ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, శంషాబాద్‌తోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆయా పట్టణాలకు ప్రజలు తరుచుగా రాకపోకలు సాగిస్తుంటారు. నందిగామ మండలంలో పరిశ్రమలు ఉండడంతో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. హైద్రాబాద్, శంషాబాద్, షాద్‌నగర్ పట్టణాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు, ప్రయాణికులు ఎండైనా, వానైనా రోడ్లపైనే బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి వచ్చింది.

ఇబ్బందులు పడుతున్నాం

బస్సుల కోసం ఎక్కడ వేచి ఉండాలో తెలియని పరిస్థితి నందిగామ మండలకేంద్రంలో నెలకొంది. ఒక్కోసారి బస్సుల కోసం విద్యార్థులు రోడ్లపై ఉరుకులు, పరుగులు తీయడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సమయానికి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాలనే కంగారులో బస్సులు రాగానే రోడ్డుపైకి విద్యార్థులు పరుగులు తీస్తున్నారు. అదే బస్టాండు సమీపంలో బస్సులు ఆపితే విద్యార్థులు, ప్రజలు ప్రశాంతంగా బస్సులు ఎక్కుతారని, ఇకనైనా త్వరగా బస్టాండ్ నిర్మాణన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీ బిల్లు ఆమోదంతోనే 'స్థానిక' ఎన్నికల్లో బడుగు వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా జాప్యం చేస్తుందని, బిల్లు ఆమోదంతోనే బడుగు, బలహీన వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో న్యాయం జరుగుతుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ బిల్లును వెంటనే ఆమోదించకుంటే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ బిల్లు ఆమోదానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కలిసి వచ్చి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. బీసీ రిజర్వేషన్‌ల బిల్లును వ్యతిరేకించే వారందరూ బీసీ ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. రాష్ట్రంలోని కొందరు బీజేపీ నేతలు బీసీ రిజర్వేషన్‌ల విషయంలో సాకులు చెబుతూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనను విజయవంతంగా చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. రిజర్వేషన్‌లతో బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పిస్తే కొందరు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జహంగీర్ అలీ, రామకృష్ణ, శంకర్, రాజేందర్, యాదయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, షాబుద్దీన్, ఇమ్రాన్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహ భవనం కూల్చివేత



జేసీబీలతో పాత బీసీ వసతి గృహ భవనాన్ని తొలగింపజేస్తున్న అధికారులు

ఆమనగల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో శిథిలావస్థకు చేరిన పాత బీసీ వసతి గృహ భవన తొలగింపు పనులు మంగళవారం ప్రారంభించారు. ఐదు దశాబ్దాల క్రితం మాడ్గుల రోడ్డులో పోలీసు స్టేషన్ వెనుక బీసీ బాలుర వసతి గృహ భవనాన్ని నిర్మించారు. కాగా, భవనం శిథిలావస్థకు చేరుకోవడం, వసతుల లేమితో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గి ఐదేళ్ల క్రితం వసతి గృహన్ని ఎత్తేశారు. దాంతో భవనం నిరూపయోగంగా మారింది. భవనాన్ని తొలగించి నూతన భవనం నిర్మాణం చేపట్టి బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని చాలాకాలంగా స్థానికులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతస్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈమేరకు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో పాత భవనాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన భవనం స్థలం 18 గుంటలు ఉన్నట్లు గుర్తించారు. పాత భవనాన్ని తొలగించాలని బీసీ సంక్షేమ శాఖ, కలెక్టర్‌లకు సూచించారు. వారి ఆదేశానుసారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పాత భవనం తొలగింపు పనులు ప్రారంభించారు. సీఎస్ఆర్ నిధులు రూ.5 కోట్లతో రెసిడెన్సియల్ పాఠశాల ఏర్పాటుకు ఎంపీ మల్లు రవి చర్యలు చేపట్టారు. ముందు భాగంలో మున్సిపాలిటీకి ఆదాయాన్ని చేకూర్చేలా దుకాణ సముదాయం, వెనుక భాగంలో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలో బీసీ వసతి గృహం, రెసిడెన్షియల్ పాఠశాల లేక విద్యార్థులు ఏళ్లకాలంగా ఇబ్బందులు పడుతున్నారు. బీసీ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేదాద్రి గుట్టపై నేడు శ్రీ లక్ష్మీసుదర్శన నారసింహ యాగం

తలకొండపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్జాల శ్రీ వేదాద్రి గుట్టపై గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నేడు(గురువారం) శ్రీ లక్ష్మీ సుదర్శన నారసింహ స్వామి యాగం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయం వద్ద నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. లోక కళ్యాణార్థం చేపడుతున్న యాగం నేపథ్యంలో ఇప్పటికే అర్చకులు నర్సింహమూర్తి, శ్రీనివాసమూర్తి, ప్రముఖవేద పండితులు మురళీధర్‌శర్మల ఆధ్వర్యంలో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు.

కొత్తగూడ ఆలయంలో రేపు ప్రత్యేక పూజలు

కందుకూరు : మండలంలోని కొత్తగూడలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసత్యసూర్యనారాయణ వాసవీ రామలింగేశ్వర ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఈనెల 25న శ్రావణమాస మొదటి శుక్రవారం పురస్కరించుకొని ఐశ్వర్యయాగం, మహాయాగం, అష్టలక్ష్మీయాగం, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మాజీ మంత్రి రవీంద్రనాయక్‌ను కలిసిన గిరిజన నేతలు



కడ్తాల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, జాతీయ గిరిజన నేత రవీంద్ర నాయక్‌ను బుధవారం కడ్తాల మండల గిరిజన నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. గిరిజనుల సమస్యలు, తండాల అభివృద్ధి, రాజకీయ అవకాశాలు తదితర విషయాల గూర్చి చర్చించినట్లు హన్మనాయక్ పేర్కొన్నారు. రవీంద్ర నాయక్‌ను కలిసిన వారిలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, ఏఎంసీ డైరెక్టర్ నరేశ్ నాయక్, నాయకులు శంకర్‌నాయక్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల కమిటీ

కేశంపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల నూతన కమిటీని బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ ప్రకటించారు. అధ్యక్షురాలిగా రొల్లు రాధిక కొనసాగుతుండగా పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా వెంకటేష్, నరసింహ, చౌడం శ్రీనివాస్, యాదమ్మ, ప్రధాన కార్యదర్శులుగా టి.నరసింహ, కె.తిరుపతి, కార్యదర్శులుగా సురేష్, సరిత, నర్సింగ్, అశోక్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీనివాస్, సభ్యులుగా రవీందర్, నరేష్, వెంకటేష్, గోపాలరెడ్డి, శాంభవి, వనజ, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, కృష్ణయ్యలను ఎంపిక చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

బీఎంఎస్‌తో ఏజెంట్ల డిమాండ్లకు మార్గం సుగమం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రావు

షాద్‌నగర్ అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలోనే అతి పెద్ద ట్రేడ్ యూనియన్‌గా ఎదిగిన భారతీయ మజ్దూర్ సంఘ్ తోనే ఎల్ఐసీ ఏజెంట్ల డిమాండ్లు నెరవేరుతాయని బీఎంఎస్ ఎల్ఐసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు అశోక్‌రావు తెలిపారు. భారతీయ జీవిత బీమా ఏజెంట్స్ సంఘ్ షాద్‌నగర్ అధ్యక్షుడు సాయిబాబా అధ్యక్షతన బుధవారం స్థానిక ఎన్‌హెచ్ 44 హోటల్‌లో ఏజెంట్ల సమావేశం జరిగింది. అశోక్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అతిపెద్ది ట్రేడ్ యూనియన్ అయిన బీఎంఎస్ 1999లో ఎల్ఐసీలో ఏర్పాటు చేసి, సమస్యలపై పోరాటం చేస్తున్నదన్నారు. భారతీయ జీవిత బీమా ఏజెంట్స్ సంఘ్‌లో సభ్యులను పెంచి, బీఎంఎస్ నాయకత్వానికి అండగా నిలువాలని పిలుపునిచ్చారు. బీఎంఎస్‌లో ఎల్ఐసీ ఏజెంట్ల సభ్యత్వం పెంచడానికి సభ్యులు కృషి చేయాలని సంఘం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణరెడ్డి కోరారు. డివిజన్ అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ ఏజెంట్ల గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్‌ను పెంచడానికి బీఎంఎస్ కృషి చేసిందన్నారు. షాద్‌నగర్ ఎల్ఐసీ మేనేజర్ ఫణిభూషన్, భారతీయ జీవిత బీమా ఏజెంట్స్ సంఘ్ నాయకులు జగదీష్, రంగరాములు, నలినీకాంత్, చంద్రమోహన్, బుచ్చిరెడ్డి, జయేందర్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, భానుప్రకాష్, బండి కిరణ్, నరేష్, నర్సింహ, కేశవులు తదితరులున్నారు.

ఆలయాలకు టెంట్‌హౌజ్ సామగ్రి వితరణ

షాద్‌నగర్ అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని భగత్‌సింగ్ కాలనీలో వెలిసిన కట్ట మైసమ్మ, పోచమ్మ ఆలయ సముదాయానికి అదే కాలనీకి చెందిన రోమియో రమేష్ బుధవారం టెంట్‌హౌజ్ సామగ్రి వితరణ చేశారుజ ఆలయ సముదాయంలో వండి, అన్నదానం చేయడానికి అవసరమైన పాత్రలను, టేబుళ్లు, బేసిన్లు, చెంచాలను ఇప్పించి భక్తి చాటుకున్నారు. అలాగే పోచమ్మ అమ్మవారికి కిరీటం చేయించారు. రమేష్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు నల్లమోని శ్రీధర్, అందె రాజేశ్వర్, శ్రీనివాస్, జంగరాజ్, సురేష్‌లు సన్మానించి, అభినందించారు.



నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

కందుకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): నేడు(గురువారం) బీజేపీ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం 10:30గంటలకు మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేయనున్న సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల పార్టీ జిల్లా కన్వీనర్ అందెల శ్రీరాములుయాదవ్, కందుకూరు మండల ఎన్నికల కన్వీనర్ తూళ్ల వీరేందర్‌గౌడ్, జిల్లా నాయకులు తేరటి లక్ష్మణ్‌ముదిరాజ్, దేవేందర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులతో పాటు గ్రామ, బూత్‌స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, సకాలంలో హాజరుకావాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేశంపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొనాయపల్లికి చెందిన పొనమోని బాలయ్య బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం పంపించారు. కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, జంగయ్య, సురేష్, హనుమంతు, రాజు, శ్రీను, సత్తయ్య, యాదయ్యలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మాజీ జడ్పీటీసీ ఇచ్చిన నగదును అందించారు.